క్లుప్తంగా

నేడు అయ్యప్ప క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 26న సంకట హర చతుర్థి, మూలా నక్షత్రం పర్వదినాలను పురస్కరించుకుని మండలంలోని గురవాయిగూడెం అయ్యప్పస్వామి క్షేత్రంలో కొలువైన గణపతి, సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, సాయంత్రం 5.30 గంటలకు గణపతికి అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం


వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు వేసవి సెలవుల నేపథ్యంలో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అనివేటి మండప ప్రాంతంతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పుణ్యక్షేత్రాలకు వెళ్లిన శ్రీనివాసపురం భక్త బృందం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన భక్త బృందం శనివారం పుణ్యక్షేత్రాలకు తరలి వెళ్లారు. ప్రత్యేకంగా బస్సులో వీరంతా అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు. ముందుగా గ్రామంలోని ఆలయాలను దర్శించుకున్నారు. కాషాయ జెండాలతో జైశ్రీరామ్ అంటూ భక్తులు పయనమై వెళ్లారు.

శ్రీవారి సేవలో జీవీ


శ్రీవారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న జీవీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రాన్ని విశాఖపట్నం స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) శనివారం సాయంత్రం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జీవీ స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. జీవీ వెంట జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, ఆచంట బన్ను, మానుకొండ సుబ్బారావు తదితరులున్నారు.

చింతలపూడిలో భారీ వర్షం


చింతలపూడిలో రోడ్డు గోతుల్లో నిలిచిన నీరు

చింతలపూడి : అల్పపీడనం ప్రభావంతో మెట్ట ప్రాంతంలో గత రెండు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. వర్షం నీరు రోడ్ల పైకి చేరి మెయిన్ రోడ్డు పెట్రోలు బంకుల సమీపంలో తటాకాన్ని తలపిస్తుంది. ఫైర్‌స్టేషన్ సెంటర్లో రోడ్డు వర్షాలకు గోతులు పడి ప్రమాదకరంగా మారింది. సరైన డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై చేరుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


పులిరామన్నగూడెంలో ర్యాలీ

బుట్టాయగూడెం: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఇ.తులసి అన్నారు. బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెంలో శనివారం బాల్య వివాహాల నిర్మూలన, కిషోర బాలికల రుతుక్రమం, ఆరోగ్య పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ తులసి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితాలు నాశనమవుతాయన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. బాల్య వివాహాలపై వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌గూడెం పీహెచ్‌సీ డాక్టర్ భాగ్యశ్రీ, పీహెచ్ఎన్ సీహెచ్ నాగపున్నారి, సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్వీ సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆరోగ్య వికాసం

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా
- 12 రకాల సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు


తిరుమలాపురం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్


చక్రదేవరపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్


పంగిడిగూడెం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం


రేచర్ల వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

జంగారెడ్డిగూడెం: అందని ద్రాక్షలా ఉన్న వైద్యాన్ని పేదలకు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరువ చేశారు. ఆయన దార్శనికతతో పల్లెల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు నిర్మిస్తున్నారు. దీంతో పట్టణాలు, మండల కేంద్రాలకు పరిమితమైన వైద్య సేవలు గ్రామీణులకు చేరువయ్యాయి. ప్రతి 2500 మంది జనాభాకు ఒక విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశారు. వాటికి అవసరమైన భవనాలు సైతం నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన భవనాల్లో ఇప్పటికే వైద్య సేవలు అందిస్తున్నారు.

శరవేగంగా నిర్మాణాలు

వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన వాటిలో వైద్య సేవలు అందిస్తుండగా, మరికొన్ని భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో మొత్తం 61 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు చేపట్టారు. ఒక్కొక్క భవనానికి రూ.20.80 లక్షలు వెచ్చిస్తున్నారు. మొత్తం 61 భవనాలకు రూ.12.69 కోట్లు ఖర్చు చేస్తున్నారు. తొమ్మిది భవనాలను నిర్మించి వైద్యారోగ్యశాఖకు ఇప్పటికే అప్పగించారు. మిలిగిన నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి.

సేవలు ఇలా..

చిన్నచిన్న జబ్బులకు కూడా దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు వైఎస్సార్ సీపీ హయాంలో దూరమయ్యాయి. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ అర్హతున్న వారిని నియమించి 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రుల్లో 65 రకాల మందులతో పాటు, 67 రకాల ప్రాథమిక వైద్య పరికరాలను సైతం అందుబాటులో ఉంచారు. టెలీ మెడిసిన్ సేవలను కూడా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గర్భిణులు, చిన్నారులకు అవసరమైన సేవలు, నవజాత శిశు సంరక్షణ, కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక సేవలు, అంటువ్యాధుల నివారణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, తీవ్రమైన సాధారణ అనారోగ్యాలు, చిన్న జబ్బులకు చికిత్స అందిస్తున్నారు. ఈఎన్‌టీ, నోటి సంబంధిత, వృద్ధాప్యంలో వచ్చే సమస్యలకు స్క్రీనింగ్ తదితర సేవలు క్లీనిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు అందుతున్నాయి.

చింతలపూడి నియోజకవర్గంలో మొత్తం హెల్త్ క్లినిక్‌లు	61
వైద్యారోగ్యశాఖకు అప్పగించినవి భవనాలు	09
నిర్మాణ పనులు పూర్తయినవి	12
పనులు తుది దశలో ఉన్నవి	08
శ్లాబ్ లెవల్‌లో ఉన్నవి	07
రూఫ్ లెవల్‌లో ఉన్నవి	14
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి	09
బేస్‌మెంట్ కన్నా కిందస్థాయిలో ఉన్నవి	02

సారా తయారీని అరికట్టాలి


గంగవరం సమీపంలోని అడవి ప్రాంతంలో సారాకి సిద్ధం చేసిన బెల్లపు ఊట

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పరిధిలోని గంగవరం పరిసర ప్రాంతాలు నాటుసారా తయారీకి నిలయంగా మారాయి. మండల కేంద్రానికి సుదూరంగా ఉండటంతో పాటు కొండలపై ఉన్న అటవీ ప్రాంతం సారా తయారీదారులకు అడ్డాగా నిలిచాయి. కొంతకాలం వరకు సారా తయారీ కేంద్రాలపై సంబంధిత శాఖాధికారులు వలంటీర్ల సాయంతో ఉక్కుపాదం మోపడంతో సారా అక్రమార్కులకు చెల్లుబాటు కాలేదు. ఇటీవల వలంటీర్లు సామూహిక రాజీనామాలు చేయడంతో సారా తయారీదారులకు కలిసి వచ్చింది. ఈ నేపథ్యంలో మళ్లీ సారా తయారీ కేంద్రాలు ఒకటిదాని వెంట మరొకటి పుట్టుకొస్తున్నాయి. గంగవరం గ్రామానికి చెందిన వ్యక్తులు నాటుసారా తయారీ చేస్తున్నారని డ్వాక్రా గ్రూపు మహిళలు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సారా తయారీ దారులపై కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సారా విక్రేత అరెస్ట్

టి.నరసాపురం: సార విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు. బండివారిగూడెం గ్రామంలో నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో వ్యక్తిని అరెస్టు చేసి, 30 లీటర్ల నాటుసారా, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని సీజ్ చేశామని హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ఎదురెదురుగా ఢీకొన్న బైక్, కారు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని జొన్నవారిగూడెంలో జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. జంగారెడ్డిగూడెం మండలం చిన్నంవారిగూడెంకు చెందిన కలపాల సుబ్బయ్య ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వచ్చారు. తిరిగి చిన్నంవారిగూడెం వెళుతుండగా సుబ్బయ్య దిచక్రవాహనం, ఎదురుగా జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయాలపాలైన సుబ్బయ్యని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో చూడి గేదె మృతి


బయ్యన్నగూడెం సమీపంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చూడిగేదె

కొయ్యలగూడెం: విద్యుత్ షాక్‌కు చూడి గేదె బలైంది. బయ్యనగూడెం సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. తలారి వెంకటేశ్వరరావు అనే రైతుకు చెందిన చూడి గేదె శనివారం పుంత రోడ్డు పక్కన మేతమేస్తుండగా విద్యుత్తు పోల్ సపోర్టు వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.95 వేలు ఉంటుందని తెలిపారు. రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందేలా కృషి చేయాలని పంచాయతీ పాలకవర్గం తరపున కోరింది.

ఘనంగా ప్రజానాట్యమండలి ఆవిర్భావ దినోత్సవం


రంగారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

టి.నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో ప్రజానాట్యమండలి ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకుని వివిధ కళారూపాలను ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ప్రజాకళా సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అని పేర్కొన్నారు. ప్రముఖ విప్లవ కళాకారులు మాదాల రంగారావుతో పాటు సినీ రంగానికి చెందిన పలువురు కళాకారులు ప్రజా నాట్యమండలి ద్వారా వచ్చిన వారేనని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ ఆర్ కృష్ణబాబు మాట్లాడుతూ తాను పల్లె నుంచి ఢిల్లీ వరకు కళా ప్రదర్శన నిర్వహించేందుకు ప్రజానాట్యమండలి దోహదపడిందని తెలిపారు. బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, రంగస్థల కళాకారుడు వెలగపాడు రత్నం, పౌరాణిక కళాకారుడు తోట సత్యనారాయణ, నెల్లూరు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో భక్తుల సందడి


పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఉత్తరంవైపు ఏడు కొండల్లో ఆరో కొండపైన పారిజాత వృక్షలలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము 5 గంటలకు సుప్రభాతసేవతో మొదలుకుని, ఆరాధన, బాల భోగనివేదన, తీర్థ ప్రదాగోష్టి, అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అష్టోత్తర పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. వేసవి కాలంలో సెలవులు కావడంతో భక్తులు, ఉద్యోగస్తులు పారిజాతగిరికి పోటెత్తారు. విద్యార్థులు 108 ప్రదక్షిణలు చేసుకుని శ్రీస్వామి వారిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీస్వామి వారి అంతరాలయంలో భక్తులు సౌకర్యర్థం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగాప్రసాద్ ఏసీ బహూకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు జంగారెడ్డిగూడెంకు చెందిన పుల్లారావు, శ్రీలక్ష్మి దంపతులు, గాల రాజు, పుష్పలత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు శ్రీస్వామి వారి శేషా వస్త్రాలు ప్రసాదాలుతో సన్మానించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం


సదస్సులో మాట్లాడుతున్న విత్తనాల రాజు

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో రామచంద్రపురం సచివాలయంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం బార్ సోసియేషన్ జనరల్ సెక్రెటరీ విత్తనాల రాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. కొన్ని సందర్భాల్లో అనుకోకుండా పిల్లలు తప్పిపోతుంటారని, తల్లిదండ్రులు పర్యవేక్షణలో పిల్లలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. డబ్బు సంపాదన ధ్యేయంగా కొందరు పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేయడం లేదా పిల్లల అవయవాల్ని విక్రయించడం చేస్తారని చెప్పారు. ధనవంతుల పిల్లలను కిడ్నాప్ చేసి వార్ని వదిలి పెట్టడానికి ఎక్కువ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ ఉంటారని తెలిపారు. న్యాయవాదులు బందారు లతా కుమారి, పిల్లి పెద్దిరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కడెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


గ్రామ దేవత కడెమ్మ తల్లిని గ్రామ నడిబొడ్డులో నెలకొల్పిన దృశ్యం


కడెమ్మ తల్లి

పోలవరం రూరల్: గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పోలవరం గ్రామస్తులు, రైతులు గ్రామ దేవత కడెమ్మ తల్లికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారిని గ్రామంలోని నడిబొడ్డు వద్ద ఏర్పాటు చేసిన పూరిపాకలో నెలకొల్పారు. 10 రోజులపాటు అమ్మవారిని గ్రామంలో ఉంచి, పూజలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారిని ఆలయానికి సాగనంపుతారు. గ్రామంలో సకాలంలో పంటలు పండటమే కాక ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ గ్రామస్తులు 10 రోజలపాటు అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకుంటారు.

మాసిక మహోత్సవం


గవరవరం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ స్వర్ణకుమారి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

కొయ్యలగూడెం: మాసిక మహోత్సవ కార్యక్రమం శనివారం గవరవరం అంగన్‌వాడీ కేంద్రం (24)లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సీడీపీఓ యూఎన్ స్వర్ణకుమారి పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలకు రుతుక్రమంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పర్సన్ హైజీన్‌గా ఉండటం, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. అనంతరం పొంగుటూరు సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీవీ నాగమణి, కె.నాగకుమారి, సీహెచ్ పాప, కె.సుజాత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మాసిక మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి రుతుక్రమం సమయంలో ఉండే అపోహలు, ఆరోగ్యం, పరిశుభ్రత, రుతుక్రమం సమయంలో వాడే ఉత్పత్తులు, వాటిని పారవేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది గంగారత్నం, రోహిణి, ఏఎన్ఎం ప్రసన్న, ఆశావర్కర్ నాగమణిలు పాల్గొన్నారు.

శ్రీనివాస్, ఉమాబాల విజయం కోరుతూ చినవెంకన్నకు పూజలు


శ్రీవారి దర్శనానంతరం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతానికి చేరుకున్న వైఎస్సార్ సీపీ నేతలు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థిగూడూరి ఉమాబాల గెలుపొంది, జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుతూ భీమవరం నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ద్వారకాతిరుమల చినవెంకన్నకు శనివారం పూజలు చేశారు. తొలుత భీమవరంలోని శ్రీ మావుళ్లమ్మవారి ఆలయంలో ఉమాబాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి కార్లతో ర్యాలీగా శ్రీవారి క్షేత్రానికి చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భీమవరం జెడ్పీటీసీ కాండ్రేకుల నరసింహారావు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్న వైఎస్సార్ సీపీకి, దైవానుగ్రహం తోడవ్వాలని, తామంతా యాత్రగా క్షేత్రానికి వచ్చి, శ్రీవారిని దర్శించుకున్నట్టు చెప్పారు. దాదాపు 100 మంది నాయకులు, కార్యకర్తలు యాత్రగా వచ్చామన్నారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ విజయం సాధించి, మరోసారి ప్రభంజనాన్ని సృష్టిస్తారని ఆయన చెప్పారు. గ్రంధి శ్రీనివాస్, ఉమాబాల ఇద్దరూ విజయాన్ని సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కలిదిండి కృష్ణంరాజు, కోట్టి కుటుంబరావు, ఆరేటి వీరా సోమనాయుడు (పెద్దబ్బులు), నామన మహేష్, కోళ్ల బాలకృష్ణ, కోమటి రాంబాబు, కొప్పర్తి సత్యనారాయణ, జడ్డు నరసింహారావు, తిరుమణి ధనుంజయ్ తదితరులున్నారు.

వృత్తి విద్యా కోర్సులు ఎప్పటికీ ఉపాధి మార్గాలే


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య చేతుల మీదుగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అద్దయ్య మాట్లాడుతూ విద్యాభ్యాసాన్ని ఒక తపస్సులా భావించిన రోజున, వయసుతో సంబంధం లేకుండా విజయం వరిస్తుందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో నేర్చుకునే వృత్తి విద్యా కోర్సులు ఎప్పటికీ ఉపాధి మార్గాలే అన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే ఉద్యోగాలు సాధించడం శుభపరిణామమని, ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ నుంచి ఐదుగురు, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి ఐదుగురు విద్యార్థులు ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు సాధించారని వివరించారు. వీరందరికీ శనివారం నియామకపత్రాలు అందజేశామన్నారు. కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు కళాశాలలో అందిస్తున్నామని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ జీఎం అంజయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గెలుపోటములపై జోరుగా బెట్టింగులు

- చింతలపూడి నియోజకవర్గంలో రూ.లక్షల్లో పందాలు

చింతలపూడి : అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేలడానికి ఇంకా 10 రోజుల వ్యవధి ఉంది. ఈలోగా అభ్యర్థుల గెలుపోటములపై చింతలపూడి నియోజకవర్గంలో బెట్టింగుల జోరు ఊపందుకుంది. గతంలో ఈ బెట్టింగులు రాజకీయ నేతలు, రాజకీయాలపై ఆసక్తి ఉన్న కొద్ది మందికే పరిమితమై ఉండేది. ఈసారి సామాన్యుల కూడా బెట్టింగులకు ఆసక్తి చూపడంతో ఊహించని స్థాయిలో పందాలు సాగుతున్నట్లు తెలిసింది. చింతలపూడి అసెంబ్లీ బరిలో వైఎస్సార్ సీపీ నుంచి కంభం విజయరాజు, టీడీపీ నుంచి సొంగా రోషన్ కుమార్‌ల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే, తమ పార్టీ విజయం సాధిస్తుందంటూ ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు రూ.లక్షల్లో పందాలు కాయడానికి సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఓటర్లు విజయరాజు వైపే కొమ్ము కాశారని పోలింగ్ రోజున ఓటింగ్ సరళిలో అది స్పష్టంగా కనిపించిందని ఆపార్టీ నాయకులు ధీమాగా చెబుతున్నారు. ఆ పార్టీ అభ్యర్థి గెలుపుపై పందాలు కాసే వారి సంఖ్య పెరిగింది. కొన్ని పార్టీల్లో నాయకుల మెజార్టీపై పందాలు కడుతుండగా, మరికొన్ని పార్టీల్లో గెలుపోటములపై పందాలు కాస్తున్నారు. అలాగే రాష్ట్రంలో ఎవరు ముఖ్యమంత్రి అవుతారన్న దానిపైనా ఎక్కువ మంది పందాలు కాస్తున్నట్టు సమాచారం. ఎన్నికలపై బెట్టింగులు కట్టడం చట్టరీత్యా నేరమని ఎన్నికల సంఘం, పోలీసులు హెచ్చరిస్తున్నా బెట్టింగ్ రాయుళ్లు లెక్క చేయడం లేదు. నియోజకవర్గం నాయకులే కాకుండ ఇతర జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్లు భారీగా తరలివచ్చి ఇక్కడ తిష్ట వేసినట్లు తెలిసింది. వీరు గ్రామాల్లో తిరుగుతూ ఎవరి పట్ల ఓటర్లు మొగ్గ చూపారు? ఎవరు గెలిచే అవకాశాలు ఉన్నాయి? అన్న సమాచారం సేకరించి అభ్యర్థుల గెలుపుపై అవగాహనకు వచ్చిన అనంతరం స్థానిక మధ్యవర్తులను సంప్రదించి రూ.లక్షల్లో బెట్టింగులకు దిగుతున్నట్టు సమాచారం. ఓట్ల లెక్కింపు తేదీ నాటికి ఈ బెట్టింగుల జోరు రూ.కోట్లు దాటవచ్చునని చెబుతున్నారు.